# గణేష్ నిమజ్జనాలకు పకడ్బందీ చర్యలు

### జిల్లా వ్యాప్తంగా 1537 గణేష్ విగ్రహాలు

### నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన ఎస్పీ

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 14: భద్రాచలం గోదావరి నదికి నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశామని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. శనివారం నిమజ్జనం జరిగే ప్రదేశాలను ఆయన ఏఎస్పీ అంకిత్‌కుమార్, ఉత్సవకమిటీ నిర్వాహకులతో కలిసి పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు పూర్తయ్యేలా సహాయ, సహకారాలు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో గణేష్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు, నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు సమయంలో డీజేలు, బాణసంచా కాల్చడం వంటివి నిషిద్ధమన్నారు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మొత్తం 1537 విగ్రహాలతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో భద్రాచలంలో గోదావరిలో నిమజ్జనానికి గణనాథులను తీసుకువస్తారని, ఆ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు జరిగేలా కమిటీ బాధ్యులు, ఉత్సవకమిటీల నిర్వాహకులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయలక్ష్మి, ఉత్సవ కమిటీల నిర్వాహకులు పాకాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

## క్షేమంగా ఇళ్లకు చేరిన 'ఆశ్రమ' పిల్లలు



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో రాధ

టేకులపల్లి, సెప్టెంబర్ 14 : కోయగూడెం ఆశ్రమ పాఠశాల నుంచి శుక్రవారం సాయంత్రం పారిపోయిన ఆరవ తరగతి చదువుతున్న ఇద్దరు పిల్లలు శనివారం ఉదయం క్షేమంగా ఇళ్లకు చేరారు. వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామపంచాయతీ ఉయ్యాలబడవ గ్రామానికి చెందిన ఈసం అభిరామ్, శెట్టిపల్లి గౌతమ్‌లు తల్లిదండ్రులపై బెంగతో పాఠశాలలో చెప్పకుండా శుక్రవారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో పారిపోయారు. ఇంటికి వెళితే తల్లిదండ్రులు కొడతారేమోననే భయంతో తమ పత్తి చేల వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి రాత్రి సమయంలో గ్రామంలోని పాఠశాలకు వెళ్లి పడుకున్నారు. అయితే పాఠశాలలో నిద్రిస్తున్న అభిరామ్, శెట్టిపల్లి గౌతమ్‌లను శనివారం ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. దీంతో వారు వచ్చి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ పిల్లలు ఇళ్లకు చేరడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా.. కోయగూడెం ఆశ్రమ పాఠశాలను ఏటీడబ్ల్యూవో రాధ సందర్శించి.. పాఠశాల నుంచి ఇద్దరు పిల్లలు పారిపోయిన ఘటనపై వివరాలు సేకరించారు. పిల్లలను అనుమతి లేకుండా బయటకు పంపొద్దని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్‌ఎం అమర్‌సింగ్, వార్డెన్ నాగేశ్వరరావుకు సూచించారు.

## సీపీఐ నేత పువ్వాడను కలిసిన రావులపల్లి



పువ్వాడను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న రావులపల్లి రాంప్రసాద్

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 14: సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావును బీఆర్‌ఎస్ భద్రాచలం నియోజకవర్గ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ శనివారం ఖమ్మంలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పువ్వాడ జన్మదినం సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పువ్వాడను కలిసిన వారిలో నాయకులు ఐనాల రామకృష్ణ, దాసరి బాలకృష్ణ ఉన్నారు.

## సింగరేణి గ్రౌండ్‌లో క్రీడాపోటీలు

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 14: స్థానిక 24 సింగరేణి గ్రౌండ్‌లో సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ లాన్ టెన్నిస్ పోటీలను క్రీడల గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్ ప్రారంభించారు. ఉపరితల గని టీమ్‌లోని మెన్స్ సింగిల్స్, డబుల్స్, వెటరన్స్ కేటగిరిలలో మ్యాచ్‌లు జరిగాయి. కో–ఆర్డినేటర్ రమేష్‌సింగ్, కెప్టెన్ అన్వర్ పాల్గొన్నారు.

**అశ్వారావుపేట రూరల్‌లో..**

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 14: మండలంలోని ఆసుపాక గ్రామంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్ శనివారం ప్రారంభించారు. ఆయనను నిర్వాహకులు సన్మానించారు.

## సంక్షేమ పథకాలను ప్రభుత్వమే అందించాలి

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 14: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వమే అందించాలని కోరుతూ జేఏసీ నాయకులు శనివారం ఇల్లెందులోని సీతారామ సెంటర్ ఏరియాలో సంతకాలు సేకరించారు. రావుల ఉపేందర్, సారంగపాణి, యాకూబ్‌షావలి, శేషయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణాలపై అవగాహన

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 14: కొత్త పంట రుణాలపై రైతులకు ఎస్‌బీఐ అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని రేపల్లెవాడ రైతు వేదికలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఎం ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ.. రైతులు కొత్త పంట రుణాలకు దరఖాస్తు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు.

## సైబర్ నేరస్తుడు అరెస్టు

పర్ణశాల, సెప్టెంబర్ 14 : అంతర్‌రాష్ట్ర సైబర్ నేరస్తుడిని దుమ్ముగూడెం పోలీసులు అరెస్టు చేశారు. కస్టమర్ సర్వీసు పేరుతో సైబర్ క్రైం ద్వారా అమాయక ప్రజల వద్ద డబ్బులు దోచుకుంటున్న నేరస్తుడు బిదుర్ మహాను పోలీసులు అరెస్టు చేసి భద్రాచలం కోర్టుకు తరలించినట్లు దుమ్ముగూడెం పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పెదబండిరేవు గ్రామానికి చెందిన రఫిక్ గూగుల్‌లో చీరెలను సెర్చ్ చేస్తూ ఒక వెబ్‌సైట్‌లో చీరెలకు ఆర్డర్ ఇచ్చారు. ఆ చీరె ఆమెకు నచ్చకపోవడంతో రిటన్ చేయడానికి అదే యాప్‌లో కస్టమర్ కేర్ నెంబర్ ఇచ్చారు. ఆ నెంబర్‌కి కాల్ చేస్తే మీకు లింక్ పంపిస్తాము దానిని ఓపెన్ చెయ్యాలని చెప్పడంతో లింక్‌ను ఓపెన్ చేసి యూపీఐ పిన్ ఎంటర్ చెయ్యమని చెప్పడంతో ఆమె యాప్‌లో వివరాలను నమోదు చేవారు. దీంతో సెబర్ మోసగాడు ఆమె ఖాతా నుంచి రూ.5వేలు కాజేశాడు. వెంటనే అప్రమ త్తమైన ఆమె దుమ్ముగూడెం పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు హైదరాబాద్ సైబర్ క్రైం ద్వారా నిందితుడిని పట్టుకున్నారు. పోలీసులు అతన్ని శనివారం భద్రాచలం కోర్టులో హాజరుపరిచారు. సైబర్ క్రైంలతో జర జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WATNED
★ శ్రీ బాలాజీ ఎస్టేట్స్, ఖమ్మం నందు సీనియర్ అకౌంటెంట్‌గా పని చేయుటకు ఆసక్తిగల అభ్యర్థులు ఆఫీస్ నందు సంప్రదించగలరు.
Mob: 9492884899, 9985953170.
NT-335804

CHANGE OF NAME
I, MOHAMMED ABUDL SHAFI (Old Name), S/o. Mohammed Abdul Rasheed (Old Name), S/o.Mohammed Abdul Haleema Shaheda bee (Old Name) R/o. H.No. 5-1-163, SP Office Road, Khammam Urban, Khammam Dist., Telangana State. Have changed my name as MOHAMMAD ABDUL SHAFI (New Name), S/o. MA Abdul Rasheed (New Name), S/o. MA Shaheda bee (New Name)
Date : 14-09-2024 Place : KHAMMAM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## పౌరహక్కుల నాయకుల అరెస్ట్ అప్రజాస్వామికం

పినపాక, సెప్టెంబర్ 14: పౌర హక్కుల సంఘాల నాయకులను నిర్బంధించడం అప్రజాస్వామికమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వల్లెపోగు వెంకటేశ్వర్లు ఖండించారు. పౌర హక్కులను హరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

## అరెస్టుకు ఖండన

టేకులపల్లి, సెప్టెంబర్ 14: కరకగూడెం వద్ద మావోయిస్టుల ఎన్‌కౌంటర్ ఘటనలో నిజ నిర్ధారణకు వెళ్తున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.లక్ష్మణ్‌ను, కార్యదర్శి నారాయణరావును, సహాయ కార్యదర్శి కుమార స్వామిని, మరి కొందరు నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు ప్రసాద్ ఖండించారు.

## పౌర హక్కుల నేతల అరెస్ట్

గుండాల, సెప్టెంబర్ 14: రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణ కోసం వెళ్లిన పౌర హక్కుల సంఘం నాయకులను మణుగూరు పోలీసులు నిర్బంధించడాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గుండాల మండల కమిటీ పిలుపునిచ్చింది. శనివారం గుండాలలో జరిగిన సమావేశంలో నాయకు లు మాట్లాడారు. నాయకులు కోరం సీతారాములు పెండెకట్ల పెంటయ్యా, యాసారపు వెంకన్న, మానాల ఉపేందర్, బానోత్ లాలు పాల్గొన్నారు.

## ప్రజాపంథాలో చేరికలు

చర్ల, సెప్టెంబర్14: చర్ల మండలం సుబ్బంపేట పంచాయతీ రాజయ్యనగర్‌కు చెందిన 20 కుటుంబాల ఆదివాసీలు సీపీఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథాలో చేరారు. శనివారం రాజయ్యనగర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చేరామని ఆదివాసీలు తెలిపారు. డివిజన్ నాయకుడు కొండా చరణ్, కొండా కౌసిక్ నాయకత్వంలో తాము పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆదివాసీలు అన్నారు.

## కొండచిలువ కలకలం

రామవరం, సెప్టెంబర్ 14: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ స్టడీ రూంలో శుక్రవారం రాత్రి కొండచిలువ కలకలం రేపింది. స్టడీ రూంలో చదువుకుంటున్న విద్యార్థులకు సుమారు ఎనిమిది అడుగుల పొడవున్న కొండ చిలువ కనిపించింది. వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్నేక్ క్యాచర్ కోలాపురి మురళికి సమాచారమిచ్చారు. ఆయన వెళ్లి, కొండచిలువను పట్టుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

## పోషకాహార మహోత్సవం

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 14: పట్టణంలోని పరదేశి బస్తీ, స్టేషన్ బస్తీలలో శనివారం పోషకాహార మహోత్సవాన్ని సీడీపీవో అరుణ కుమారి నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. సూపర్‌వైజర్ రోహిణి, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, మాధవి, అరుణ, లావణ్య, ఆయా సీతారత్నం పాల్గొన్నారు.

## దివ్యాంగ చిన్నారులకు అన్నదానం

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 14: దివ్యాంగుల చిన్నారులు తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ ఒకరినొకరు ఆనందాన్ని పంచుకుంటూ వికాసం పాఠశాలలో చదువుకోవడం చాలా సంతోషకరమని ఐటీడీఏ పీవో సతీమణి మనీషా అన్నారు. శుక్రవారం రాత్రి ఐటీడీఏ కార్యాలయంలో నివాస గృహాల్లో మహాగణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో దంపతులు ఇద్దరూ పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

# 'ఏచూరి'కి పలువురి నివాళి





అశ్వారావుపేట టౌన్: నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, చంద్రుగొండలో సీపీఎం నాయకులు

అశ్వారావుపేట టౌన్/చంద్రుగొండ/దమ్మపేట/ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 14: సీపీఎం జాతీయ కార్యవర్గ సీతారాం ఏచూరి మృతితో వామపక్ష ఉద్యమాలకు పెద్ద లోటు ఏర్పడిందని నాయకులు నివాళులర్పించారు. శనివారం జరిగిన సంతాప సభల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి, పిడికిళ్లు బిగించి, 'లాల్ సలామ్' అంటూ అంజలి ఘటించారు. అశ్వారావుపేటలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సభలో జిల్లా కార్యదర్శి సయ్యద్ సలీమ్, నాయకులు గన్నిన రామకృష్ణ, పటాన్ జలాల్, ఎస్‌కె.అబ్బాస్, జోసెఫ్ రాజు, సైదా, బొత్తయ్య, ఖాదర్, సంజయ్, ముత్యాల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. చంద్రుగొండలోని ప్రధాన్ సెంటర్‌లో జరిగిన సంతాప సభలో సీపీఎం మండల కార్యదర్శి ఐలూరి రామిరెడ్డి, నాయకులు పెద్దిని వేణు, రాయి రాజా తదితరులు పాల్గొన్నారు. దమ్మపేట మండలం మందలపల్లిలోని సుందరయ్య భవనంలో జరిగిన సంతాప సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, నాయకులు కొప్పుల శ్రీను, సరోజిని, జయ, శ్రీదేవి, మంగ, ఆమని, సీపీఎం నాయకులు దొడ్డా లక్ష్మినారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఇల్లెందులోని మున్సిపల్ అడ్డాలో జరిగిన సంతాప సభలో సీపీఎం నాయకులు అబ్దుల్ నబీ, తాళ్ళూరి కృష్ణ, ఆలేటి కిరణ్‌కుమార్, మన్యం మోహన్‌రావు, రాందాస్, రాంచందర్, సంజీవ్, కృష్ణ, వేణు, శ్రీను, దాసు , వీరభద్రం, వెంకన్న, యాకూబ్ పాష, కోటమ్మ, సుజాత, నీలారాణి, సంతోష్, నర్సయ్య, శ్రీను, జైబున్నీసా, పద్మ తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: నివాళి అర్పిస్తున్న నాయకులు

## 'అనుబోస్'లో ఇంజినీర్స్ డే



ఇంజినీరింగ్ లెక్చరర్‌ను సన్మానిస్తున్న చైర్మన్ భరత్

పాల్వంచ, సెప్టెంబర్ 14: స్థానిక అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంత్యుత్సవం (ఇంజనీరింగ్ డే) జరిగింది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంజినీర్‌గా దేశానికి అయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఇంజినీరింగ్ లెక్చరర్లను కళాశాల చైర్మన్ టి.భరత్ కృష్ణ సన్మానించారు. ప్రిన్సిపాల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల్లో అన్నదానాలు





చర్ల: ఆయిల్‌బంక్‌వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు, బూర్గంపహాడ్: అన్నదానం చేస్తున్న గాదె మాధవరెడ్డి

సారపాక, సెప్టెంబర్ 14: మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో, సారపాకలోని వర్తక సంఘం ఆధ్వర్యంలో, ముత్యాలంపేట సమీపంలోని గణేష్ మండపం వద్ద నిర్వాహకులు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా ఉత్సవ కమిటీల నిర్వాహకులు, గ్రామపెద్దలు, భక్తులు, యువకులు పాల్గొన్నారు.



సారపాక: భక్తులకు అన్నదానం చేస్తున్న కమిటీ బాధ్యులు

**భగవాన్‌దాస్‌కాలనీలో..**

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 14: పట్టణంలోని భగవాన్‌దాస్‌కాలనీలో శ్రీరామ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని సంఘ సేవకులు, అబ్దుల్‌కలాం అవార్డు గ్రహీత గాదె మాధవరెడ్డి ప్రారంభించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

**చర్లలో..**

చర్ల, సెప్టెంబర్ 14: చర్ల మండలంలోని ఆయిల్‌బంక్ ఏరియాలోని వినాయక ఉత్సవకమిటీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంత్రి పర్యటనతో అంబులెన్స్‌కు బ్రేకులు

### ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన అంబులెన్స్

### దారి మళ్లించి పంపిన పోలీసులు

పాల్వంచ, సెప్టెంబర్ 14: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పాల్వంచలో ఏర్పాటు చేసిన గణనాథులను సందర్శించేందుకు శనివారం రాత్రి పాల్వంచకు రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. పట్టణంలోని వివిధ కూడల్లలో ఏర్పాటు చేసిన గణనాథులను సందర్శించారు. అనంతరం రాత్రి 9.10 గంటల సమయంలో పట్టణంలోని కిన్నెర సాని రోడ్డు అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కాన్వాయ్‌తో రోడ్డు మెత్తం ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న అంబులెన్స్.. మంత్రి కాన్వాయ్‌లో చిక్కుకుంది. అంబులెన్స్ సైరన్ మోగుతున్నా కూడా మంత్రి కాన్వాయ్‌లోని కార్యకర్తలు, ఇతరుల వాహనాలను ఎవ్వరూ కూడా పక్కకు జరపలేదు. దీంతో 10 నిముషాలకు పైగా అంబులెన్స్ ట్రాఫిక్‌లో ఇరుక్కు పోవడంతో పట్టణ ఎస్సై సుమన్ అక్కడకు చేరుకున్నారు. అంబులెన్స్‌ను వెనక్కు నడిపించి, ఫారెస్ట్ ఆఫీస్ దారి డివైడర్ పక్క నుంచి ట్రాఫిక్‌కు ఎదురుగా (ఎడమ పక్కకు కాకుండా కుడి పక్కకు) రోడ్డు మీదుగా పంపించారు. దీనిని మీడియా మిత్రులు చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది చూసిన వారంతా.. మంత్రి కాన్వాయ్‌పై విమర్శలు గుప్పించారు.

## రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

బూర్గంపహాడ్(భద్రాచలం), సెప్టెంబర్ 14: భద్రాచలం సీతారామచంద్రస్వా మి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం, నిత్యపూజలు చేశారు. స్వామికి బేడా మండపంలో నిత్యకల్యాణం నిర్వహించారు.

**భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎస్పీ దంపతులు**

భద్రాచలం సీతారామచంద్ర స్వామిని శనివారం ఎస్పీ బీ రోహిత్‌రాజ్ దం పతులు కుటుంబసమేతంగా ద ర్శించుకున్నారు. తొలుత అర్చకు లు వారికి స్వాగతం పలికి గర్భగుడిలో పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ఈవో రమాదేవి, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

**అన్నదానానికి వితరణ**

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో నిత్యాన్నదానం నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పామూరు మండలం చిలంకూరు గ్రామానికి చెందిన దేవినేని శ్రీరాములు, బ్రాహ్మణి దంపతులు రూ.50వేలు శనివారం వితరణగా అందజేశారు.

## డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 14: డెంగీ జ్వరాలు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కొమరారం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత కోరారు. మండలంలోని పోలారం, కొమ్ముగూడెం పంచాయతీల్లో జ్వర పీడితులను శనివారం పరీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. కొమ్ముగూడెంలో డెంగీ కేసు ఒకటి నమోదైనట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు–నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. జ్వరం, తలనొప్పి, అలసట అనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

## ముంపు బాధితులకు నిత్యావసర కిట్లు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 14: సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముం దుంటారని హై దరాబాద్ ఐఐఎంసీ కళాశాల చైర్మన్ కె.రఘువీర్, ఎన్‌ఎస్ ఎస్ యూనిట్–2 ప్రోగ్రాం కో–ఆర్డినేట ర్ రామ కృష్ణ, హైదరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సరాబు లక్ష్మణ గుప్తా అన్నారు. శనివారం స్థానిక కిన్నెర కల్యాణ మండపంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ వారి ఆధ్వర్యంలో రూ.6 లక్షల విలువైన 300 నిత్యావసరాల కిట్లను సుందరయ్యనగర్, ఆదర్శ్‌నగర్, గాంధీనగర్, మేదరబస్తీ ఏరియాలలో ముంపునకు గురైన కుటుంబాలకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. దోసపాటి వెంకటేశ్వరరావు, దారా రమేశ్, చిత్తలూరి ఉమ, ఎలుగూరి నగేశ్, తాతా శ్రీనివాసరావు, పెండ్యాల విజయభాస్కర్, దారా నగేశ్ పాల్గొన్నారు.

## ఎస్‌ఎస్‌ఎఫ్‌టీ ఉద్యోగుల ఔదార్యం

సారపాక, సెప్టెంబర్ 14: సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్న రామచందర్‌రావు అనారోగ్యంతో మూడు నెలలుగా విధులకు హాజరుకావడం లేదు. విషయం తెలుసుకున్న ఎస్‌ఎస్‌ఎఫ్‌టీ ఉద్యోగులు అందరి సహకారంతో రూ.30వేలు సేకరించి శనివారం రామచందర్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ హెడ్ శేషగిరిరావు, ఉమ, పాల్గొన్నారు.

## నిమ్మలగూడెంలో వైద్య శిబిరం

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 14: మండలంలోని నిమ్మలగూడెంలో శనివారం నర్సాపురం వైద్యాధికారి సుభాష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సిబ్బందితో ఇంటింటికి వెళ్లి సర్వే, డ్రైడే నిర్వహించారు.

## నిధులు ఇవ్వాలని మంత్రికి వినతి

అశ్వారావుపేట, సెప్టెంబర్ 14: తన నియోజకవర్గంలో వరదలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హైదరాబాద్‌లో శనివారం వినతిపత్రం ఇచ్చారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ దినోత్సవం

పాల్వంచ, సెప్టెంబర్ 14: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం జరిగింది. హిందీ అధ్యాపకురాలిని విద్యార్థులు సన్మానించారు. ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు అరుణ కుమారి, మాధవి, వెంకటేశ్వర్లు, కామేశ్వరరావు, స్వరూపారాణి, రమేష్, రాంబాబు, శ్రీనివాస్, సౌమ్య, షెహనాజ్ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు బస్ పాసులు

టేకులపల్లి, సెప్టెంబర్ 14: కోయగూడెంలో దివ్యాంగులకు బస్‌పాస్ శిబిరాన్ని ఆర్టీసీ సిబ్బంది శామ్యూల్, నరేంద్రకుమార్ శనివారం నిర్వహించారు. 20 మందికి పాస్‌లు ఇచ్చారు.

## యువకుడిని కాపాడిన పోలీసులు

సారపాక, సెప్టెంబర్ 14: గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి యత్నించబోయిన ఓ యువకుడిని బూర్గంపహాడ్ బ్లూకోట్ పోలీసులు కాపాడిన ఘటన శనివారం మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వద్ద చోటు చేసుకుంది. అశ్వాపురం మండలం మొండికుంటకు చెందిన గొర్రెముచ్చు రాజ్‌కుమార్ నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సమీపంలోని గోదావరిలో దూకే ప్రయత్నం చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై రాజేష్ వెంటనే బ్లూకోట్ సిబ్బందికి విషయం చెప్పగా బ్లూకోట్ కానిస్టేబుళ్లు వెంకటరమణ, సురేష్ వెంటనే ఘటనా ప్రదేశానికి వెళ్లి రాజ్‌కుమార్‌ను కాపాడారు. స్థానికులు ఎస్సై, బ్లూకోట్ సిబ్బందిని అభినందించారు.

## అట్రాసిటీ కేసు నమోదు

సారపాక, సెప్టెంబర్ 14: కులం పేరుతో దూషించిన ఘటనలో మహిళపై బూర్గంపహాడ్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌కు చెందిన నాగమణి అదే పంచాయతీకి చెందిన రత్నకుమారికి రూ.1.80 లక్షలు అప్పుగా ఇచ్చారు. రత్నకుమారి రూ.80వేలు తిరిగి చెల్లించారు. ఇంకా రూ.లక్ష ఇవ్వాల్సి ఉంది. ఎంతకూ తిరిగి ఇవ్వకపోవడంతో నాగమణి కోర్టులో చెక్‌బౌన్స్ వేశారు. ఈ క్రమంలో ఈ నెల 2న తనను కులం పేరుతో దూషించారని రత్నకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారు.

## భర్తపై వేధింపుల కేసు నమోదు

మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు పంచాయతీకి చెందిన శ్రీకాంత్ ప్రతిరోజూ మద్యం తాగి భార్యను శారీరికంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. భార్య సంధ్యారాణి శనివారం ఫిర్యాదు చేయడంతో భర్త శ్రీకాంత్‌పై ఎస్సై రాజేష్ వేధింపుల కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అశ్వారావుపేట మండలంలో జామాయిల్ కలప పట్టివేత

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 14: అటవీ ప్రాంతంలోని జామాయిల్ చెట్లను స్మగ్గర్లు నరికివేశారు. ఈ కలపను వారు తరలిస్తుండగా అటవీ అధికారి పట్టుకున్నారు. మండలంలోని నారాయణపురం ఫారెస్ట్ బీట్ పరిధిలోగల గుండిమడగు గ్రామ సమీపంలోని అటవీశాఖకు చెందిన జామాయిల్ ప్లాంటేషన్‌లోని చెట్లను ఆసుపాక గ్రామానికి చెందిన పొడియం రామకృష్ణ, పరసారాము, పాయం పవన్ నరికేశారు. ఆ కలపను ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. ఈ సమాచారంతో రేంజర్ మురళి, సిబ్బంది కలిసి ఆ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఆ ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. నరికిన జామాయిల్ బాదులను స్వాధీనపర్చుకున్నారు. వీటిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కలప ట్రాక్టర్‌ను అశ్వారావుపేట అటవీ కార్యాలయానికి తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదైంది.

## రేషన్ బియ్యం పట్టివేత

అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 14: ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఎర్రగుంట శివారు సీతారామ కాలువ బ్రిడ్జ్ సమీపంలో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిసున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. బాధ్యులైన షేక్ అజీమ్‌ను, కొర్సా రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్‌ను, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనపర్చుకున్నారు. రేషన్ డీలర్ మిడియం తులసమ్మపై కేసు నమోదు చేశారు.

## బెల్లం. బియ్యం పట్టివేత

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 14: మండలంలోని ముకుందాపురంలో ఇళ్లలో అక్రమంగా దాచిన బెల్లం, బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం స్వాధీనపర్చుకున్నారు. సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాలు.. ముకుందాపురంలోని వెంకటరమణ, సంపత్ ఇళ్లలో 12 క్వింటాళ్ల బియ్యం, 59 కేజీల బెల్లం ఉందన్న సమాచారంతో పోలీసులు తనిఖీ చేశారు. ఆ బియ్యాన్ని, బెల్లాన్ని స్వాధీనపర్చుకున్నారు. వెంకటరమణను, సంపత్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు ఎవరైనా తూట్లు పొడిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## డ్రైనేజీ నిర్మాణ మార్కింగ్ అడ్డగింత

చంద్రుగొండ, సెప్టెంబర్ 14: స్థానిక ప్రధాన సెంటర్ నుంచి జూలూరుపాడు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ ఏఈ లకన్‌నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం మార్కింగ్ చేపట్టారు. దీనిని స్థానికులు అడ్డుకున్నారు. డ్రైనేజీ నిర్మాణంతో ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోల్పోతున్న వారికి ముందుస్తు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పరిహారం విషయం కూడా తేల్చలేదని అభ్యంతరం చెప్పారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఏఈ లకన్‌నాయక్ సమాధానమిచ్చారు. డ్రైనేజీతో ఎవరికీ నష్టం జరగకుండా చూస్తామని ఏఈ హామీ ఇవ్వడంతో స్థానికులు శాంతించారు.